క్లుప్తంగా

పచ్చిరొట్ట విత్తనాలు సద్వినియోగం చేసుకోండి

ఏడీఏ రవిబాబు

శావల్యాపురం: పచ్చిరొట్ట విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏడీఏ బోయపాటి రవిబాబు అన్నారు. మంగళవారం స్థానిక రైతుసేవా కేంద్రంలో రైతులకు రాయితీపై ప్రభుత్వం మంజూరు చేసిన పచ్చరొట్ట విత్తనాలను రైతులకు అందజేశారు. ఈ సందర్భంగా ఏడీఏ రవిబాబు మాట్లాడుతూ మండలంలోని 11 రైతుసేవా కేంద్రాల్లో 65 క్వింటాళ్ల జనుము విత్తనాలు ఉన్నాయని బహిరంగ మార్కెట్‌లో పది కేజీల సంచి రూ.1090 రూపాయలు ఉండగా రాయితీ మినహాయించి రూ.545 రూపాయలు రైతులు చెల్లించాలన్నారు. అలాగే త్వరలో జీలుగులు, పిల్లిపెసర విత్తనాలు వస్తాయన్నారు. పచ్చిరొట్ట విత్తనాలు సాగు చేయడం వలన పంట పొలాల్లో అన్ని రకాల పోషకాలు సమృద్ధిగా ఉంటాయని, తద్వారా సాగుచేసిన పంటలు ఆశించిన స్థాయిలో దిగుబడులు వస్తాయన్నారు. అలాగే మండలంలోని 15 గ్రామ పంచాయతీలో 1942 మంది కౌలు రైతులకు కౌలు రైతు కార్డులు ఇవ్వడానికి లక్ష్యంగా ఎంచుకున్నామన్నారు. ఏవో రామినేని రామారావు, ఏఈవో పురేటి అశోక, రైతులు పాల్గొన్నారు.

ఘనంగా గంగమ్మ తల్లి జాతర



శావల్యాపురం: మండలంలోని ఇర్లపాడు గ్రామంలో వేంచేసియున్న గంగమ్మ తల్లి జాతర వేడుకలు గ్రామస్తులు మంగళవారం ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని మహిళలు అందరు గంగమ్మ తల్లిని దర్శించుకొని జలాభిషేకం చేసి పసుపు-కుంకుమలతో మేళతాళాల నడుమ వైభవంగా బోనాలు సమర్పించి తమ మొక్కులు తీర్చుకున్నారు. గ్రామోత్సవం కార్యక్రమంలో పార్టీల కులమతాలకు అతీతంగా భక్తులందరూ అమ్మవారిని దర్శించుకున్నారు. భారీ అన్నసంతర్పణ నిర్వహించారు.

ముగిసిన క్రికెట్ టోర్నమెంట్



రొంపిచర్ల: మండలంలోని కొత్తపల్లి గ్రామంలో గత 20 రోజులుగా నిర్వహిస్తున్న డాక్టర్ కోడెల శివప్రసాదరావు మెమోరియల్ పల్నాడు జిల్లా స్థాయి టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్ మంగళవారం ముగిసింది. మొదటి బహుమతిని డాక్టర్ లెవెన్ ఉజ్జయనీ రెడ్డిపాలెం జట్టు గెలుచుకోగా, రెండవ బహుమతిని కొత్తపల్లి జట్టు, మూడవ బహుమతిని కె.పి. కింగ్ స్టార్స్ జట్లు గెలుచుకున్నాయి. మొదటి బహుమతిగా రూ.20,116లు రెండవ బహుమతిగా రూ.15,116లు, మూడవ బహుమతిగా రూ.10,116 లను అందజేశారు. బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. విజేతలకు బహుమతులు అందించారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ బహు మతులను గంగూరి రాధాకృష్ణ, శ్రీ కృష్ణ చైతన్య విద్యాసంస్థలు, నందిగం అచ్చయ్యలు సమకూర్చగా, మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్, మ్యాన్ ఆఫ్ ద సిరీస్ బహుమతులను ఉస్తేల ప్రేమ్‌కుమార్, పావులూరి ఎంటర్‌ప్రైజెస్ వారు అందించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు యామర్తి రామారావు, కొలికొండ వెంకట్రావు, గంగూరి కోటేశ్వరరావు, కోమటినేని వెంకటేశ్వర్లు, పావులూరి వినిల్, యు.బుల్లి అబ్బాయి, టోర్నమెంట్ నిర్వాహక సభ్యులు పాల్గొన్నారు.

డీఎస్సీ పరీక్ష కేంద్రాల పరిశీలన



నరసరావుపేట ఈస్ట్: డీఎస్సీ-2025 పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ పరీక్షా కేంద్రాల నిర్వాహకులను కోరారు. ఈనెల 6వ తేదీ నుంచి జులై 6వతేదీ వరకు డీఎస్సీ పరీక్షలు నిర్వహిస్తున్న నేపథ్యంలో నరసరావుపేట పరిధిలోని పరీక్ష కేంద్రాలను డీఈఓ చంద్రకళ సందర్శించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, దూర ప్రాంతాల నుంచే వచ్చే అభ్యర్థులకు ఎటువంటి అసౌక్యం తలెత్తకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్ష రాసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పట్టణ పరిధిలోని నరసరావుపేట ఇంజినీరింగ్ కళాశాల, నరసరావుపేట ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (యలమంద), ఏ.ఎం.రెడ్డి ఇంజినీరింగ్ కళాశాల (పెట్లూరివారిపాలెం), తిరుమల ఇంజినీరింగ్ కళాశాల (జొన్నలగడ్డ), ఎం.ఏ.ఎం ఇంజినీరింగ్ కళాశాల (కేసానుపల్లి) పరీక్ష కేంద్రాలను సందర్శించారు.

చివరి నిమిషంలో హడావుడి వద్దు!

విద్యార్థులూ.. ధ్రువపత్రాల సిద్ధం చేసుకోండి

- కళాశాలలకి ముందే పత్రాల ఏర్పాట్లు తప్పనిసరి
- సకాలంలో అందాలంటే ముందుగానే దరఖాస్తు చేసుకోవాలి



యడ్లపాడు తహసీల్దార్ కార్యాలయం

యడ్లపాడు: పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షల ఫలితాలు వెలువడి, పోటీ పరీక్షలు ముగిశాయి. ఇప్పుడు వేలాది మంది విద్యార్థులు తమ భవిష్యత్ కోసం కొత్త ప్రయాణం ప్రారంభించేందుకు సిద్ధమవుతున్నారు. కళాశాలలు, విశ్వ విద్యాలయాల్లో ప్రవేశాలు ప్రారంభంకానున్నాయి. ఈ సమయంలో విద్యార్హత పత్రాలతో పాటు, ఆదాయం, కులం, నివాసం, ఈడబ్ల్యు ఎస్ వంటి అనేక ధ్రువీకరణ పత్రాలు అవసరం అవుతాయి. ఇవన్నీ చివరి నిమిషంలో సిద్ధం చేయాలంటే గందరగోళం తప్పదు. అంతేకాదు ధ్రువపత్రాలు పొందడం ఆలస్యమైతే ఒక్కోసారి అవకాశాలపై తెరపడే ప్రమాదం ఉంటుంది. కళాశాలలు ప్రారంభానికి ముందే వీటిని సిద్ధం చేసుకుంటే, అనవసరమైన ఆలస్యం, టెన్షన్ ఉండవు. అందుకే ఇప్పుడే వాటిని సమకూర్చుకునేందుకు ఇదే సరైన సమయం.

ఆ మూడు నెలలు హడావుడి..

ప్రతి సంవత్సరం జూన్ నుంచి ఆగస్టు వరకూ తహసీల్దార్ కార్యాలయాలు, సచివాలయాల వద్ద పత్రాల కోసం అత్యధికంగా దరఖాస్తులు వస్తుంటాయి. వీఆర్వోలు, ఆర్ఐలు ఫీల్డ్‌లో ఉండటంతో, ఫైళ్ల పరిశీలన, డిజిటల్ సంతకాల ప్రక్రియ ఆలస్యం కావడం, పత్రాల మంజూరులో జాప్యం జరగడం అనివార్యం అవుతుంది. ఒకసారి ఆలస్యం మొదలైతే, మళ్లీ మళ్లీ కార్యాలయాలు చుట్టేయాల్సిన పరిస్థితి వస్తుంది.

ధ్రువపత్రాల కోసం ఇలా చేయండి..

ఉన్నత విద్యలో ప్రవేశానికి కావలసిన ఆదాయం, కుల ధ్రువపత్రాల కోసం విద్యార్థులు మీ సేవా కేంద్రాలు లేదా గ్రామ /వార్డు సచివాలయాల ద్వారా దరఖాస్తు చేయాలి. దరఖాస్తుతో పాటు ఆధార్ కార్డు, రేషన్ కార్డు, విద్యా ప్రమాణపత్రాల నకళ్లను జత చేయాలి. సచివాలయ డిజిటల్ అసిస్టెంట్ ఆన్‌లైన్‌లో ఈ సమాచారం నమోదు చేస్తాడు. అనంతరం వీఆర్వో క్షేత్ర స్థాయిలో పరిశీలన చేసి, ఆర్ఐ ధ్రువీకరించడంతో తుది దశలో తహసీల్దారు పరిశీలన చేసి డిజిటల్ సంతకం చేస్తారు. అనంతరం వీఆర్వో మీ ప్రాంతానికి వచ్చి పరిశీలన చేస్తారు. ఆ తర్వాత ఆర్ఐ ధ్రువీకరిస్తారు. అన్ని వివరాలు సరైనవిగా ఉన్నట్లయితే తహసీల్దారు లాగిన్‌లో ఆఖరి ధ్రువీకరణ చేయడంతో ధ్రువపత్రం సిద్ధమవుతుంది. దానిని మీరు మీ సేవా కేంద్రం ద్వారా పొందవచ్చు.

సకాలంలో అందేలా చర్యలు



సమయానికి అవసరమైన ధ్రువపత్రాలు విద్యార్థులు పొందేలా చర్యలు తీసుకుంటున్నాం. అన్ని ప్రక్రియలు సులభంగా జరిగేలా అధికారులు ముందుగానే చర్యలు చేపడుతున్నారు. దరఖాస్తులో పొందుపరిచిన వివరాలు సక్రమంగా ఉంటే, దరఖాస్తు చేసిన 24 గంటల్లోనే ధ్రువపత్రాన్ని పొందే అవకాశం ఉంది. ఇది విద్యార్థుల సమయాన్ని, శ్రమను ఆదా చేస్తుంది.

–జెట్టి విజయశ్రీ, తహసీల్దార్, యడ్లపాడు

జగ్గాపురంలో ప్రతిష్టా మహోత్సవాలు

- గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం
- 5న ప్రతిష్టా మహోత్సవం



సిద్ధమైన విగ్రహం



ప్రతిష్టకు సిద్ధమైన సిద్ధ వినాయక స్వామి గుడి

యడ్లపాడు: గురువారం జగ్గాపురం గ్రామంలో పలు దేవతా విగ్రహాల ప్రతిష్ట మహోత్సవం ఘనంగా జరగనుంది. గ్రామంలోని బీసీ కాలనీ సమీపంలో సిద్ధి వినాయకుడు, అభయాంజనేయ స్వామి గుడులు, అలాగే గ్రామ నడిబొడ్డున గ్రామ దేవత సీతలాంబ (బొడ్డురాయి) విగ్రహాల ప్రతిష్ట కార్యక్రమాలు సిద్ధమయ్యాయి. ఈ మహోత్సవాన్ని ఆలయ అర్చక స్వాములు కొండకావూరి చంద్రశేఖర్‌శర్మ, సాయిసుబ్రహ్మణ్య రాఘవశర్మ ఆధ్వర్యంలో, కోటప్పకొండ త్రికోటేశ్వరస్వామి దేవస్థానం ప్రధాన అర్చకులు కొండకావూరి అయ్యప్ప గురుకుల్, కొండకావూరి సీతారామ ప్రసాద శర్మ పర్యవేక్షణలో నిర్వహించనున్నారు. మంగళవారం నుంచే గ్రామంలో ఆధ్యాత్మిక శోభ పెరిగింది. మంగళవారం నుండే పూజలు, హోమాలు కొనసాగుతున్నాయి. వేణుగోపాల స్వామి భజన సమాజం ఆధ్వర్యంలో భక్తిమయ కార్యక్రమాలు, పుల్లూరుకు చెందిన భజన బృందం హనుమాన్ చాలీసా గానం, మాచర్ల మహిళా భక్త బృందం నిర్వహించిన దాండియా ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. గురువారం ఉదయం 8:49కి ప్రధాన ప్రతిష్ట కార్యక్రమం జరగనుంది. అదేరోజు మధ్యాహ్నం అత్తులూరు సుముఖ గణపతి బృందం కోలాటంతో అలరించనున్నారు. అనంతరం భారీ అన్నదానం జరగనుంది. గ్రామస్తులు మాత్రమే కాకుండా చుట్టుపక్కల గ్రామాల భక్తులు కూడా పెద్ద ఎత్తున హాజరై ఈ మహోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో భాగస్వాములై ఆయా దేవతామూర్తుల కృపకు పాత్రులు కావాలని కోరారు.

కాపు ఉద్యమకారులపై వేధింపులు తగదు

శావల్యాపురం: కాపు ఉద్యమకారులపై వేధింపులకు కూటమి ప్రభుత్వం రంగం సిద్ధం చేయటం హేయమైన చర్య అని కాపు యువజన సంఘం అధ్యక్షులు కర్ణా శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటనలో తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. 2015-2019 సంవత్సరంలో కాపు రిజర్వేషన్ ఉద్యమ సమయంలో అప్పటి టీడీపీ ప్రభుత్వం అక్రమంగా కాపు యువకులు ఉద్యమకారులపై కేసులు నమోదు చేయించి వేధించారన్నారు. 2019లో వైఎస్సార్ సీపీ అధికారంలోకి రాగానే కాపు రిజర్వేషన్ సమయంలో పెట్టిన అక్రమ కేసులన్నీ ఉపసంహరించుకునేలా చేశారన్నారు. అప్పట్లో తుని రైలు దహనం కేసును సైతం విజయవాడ రైల్వేకోర్టు కొట్టివేసిందన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం కాపు రిజర్వేషన్ ఉద్యమ సమయంలో కోర్టు కొట్టివేసిన కేసులపై మరలా అప్పీలుకు వెళ్లటం దుర్మార్గమన్నారు. కూటమి ప్రభుత్వ తీరుకు కాపులందరు పార్టీలకు అతీతంగా ఉండి తమ సత్తా చూపాలన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయలేదని ఎద్దేవా చేశారు.

క్షయ రహిత సమాజమే లక్ష్యం



శావల్యాపురం: క్షయ రహిత సమాజమే అందరి లక్ష్యం కావాలని మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి రావిపూడి రమ్య అన్నారు. మంగళవారం స్థానిక ఆరోగ్య కేంద్రంలో టీబీ ముక్తా భారత్ అభియాన్ ప్రచార కార్యక్రమంతో పాటు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి రమ్య మాట్లాడుతూ రెండు వారాలకు మించి దగ్గు జ్వరం ఆకలి మందగించటం తదితర లక్షణాలతో బాధపడే వారందరూ సత్వరమే వైద్యులను సంప్రదించి సకాలంలో వైద్యసేవలు అందించటం ద్వారా ప్రాణాపాయం నుంచి తప్పుతుందన్నారు. ఆరోగ్య కేంద్రంలో ఉచితంగా వైద్య పరీక్షలు చేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు అలవలపూడి ఏడుకొండలు, ఉమాదేవి, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

వెన్నుపోటు దినం ర్యాలీలో పాల్గొనాలి

చిలకలూరిపేట: అలవి కాని హామీలతో అధికారంలోకి వచ్చి ప్రజలను మోసం చేస్తున్న ప్రభుత్వ తీరును నిరసిస్తూ బుధవారం వెన్నుపోటు దినం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ కార్యాలయ వర్గాలు తెలిపాయి. ఎన్‌ఆర్‌టీ రోడ్డులోని మాజీమంత్రి, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి విడదల రజిని నివాసం నుంచి ఉదయం 9 గంటలకు ర్యాలీగా బయలుదేరి తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి వినతి పత్రం అందజేయనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ మోసాలకు వ్యతిరేకంగా శాంతియుతంగా నిర్వహించే ఈ ర్యాలీలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

వాహనాల తనిఖీ

నరసరావుపేట: సామాజిక భద్రతను మెరుగుపర్చేందుకు, శాంతిభద్రతలను పరిరక్షించేందుకు మున్సిపల్‌ఆఫీస్ రోడ్డు పరిసరాలలో వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ అధికారులు విజిబుల్ పోలీసింగ్‌లో భాగంగా మంగళవారం వాహనాల తనిఖీ చేశారు. చట్టవిరుద్ధ చర్యలు, అనుచిత కార్యకలాపాలను నిరోధించటం, ట్రాఫిక్ నియమాలను సమర్థవంతంగా అమలు చేయటం, ప్రజలకు భద్రతా భావన కలిగించటం, వాహనాల పత్రాలు, హెల్మెట్, నంబరు ప్లేట్, మద్యం సేవించి వాహనం నడుపుతున్నది.. వంటి అంశాలపై తనిఖీలు చేశారు. ఇందులో భాగంగా ప్రధాన కూడళ్ల వద్ద పోలీసు బృందాలు నియమించబడి నిరంతరంగా పర్యవేక్షించారు. తనిఖీల సమయంలో ప్రజలు సహకరిస్తూ వాహనదారులు తప్పనిసరిగా తమ వాహన సంబంధిత పత్రాలు వెంట తీసుకెళ్లాలని, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సీఐ ఎం.విజయచరణ్ కోరారు. ప్రజల్లో విశ్వాసాన్ని పెంపొందించే అవకాశం కలిగి ఉండటంతో పాటు నేరాల నివారణకు దోహదపడతాయని అన్నారు. ఎస్ఐ అరుణ పాల్గొన్నారు.

కుష్టువ్యాధి నియంత్రణకు కృషి చేయాలి

వైద్య ఆరోగ్య శాఖ డీడీ దేవసాగర్



మాట్లాడుతున్న డీడీ దేవసాగర్

నాదెండ్ల: రాష్ట్రంలో కుష్ఠువ్యాధి నివారణకు మరింత కృషి చేయాల్సిన అవసరం ఉందని వైద్య ఆరోగ్య శాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ దేవసాగర్ చెప్పారు. నాదెండ్ల మండలం గణపవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. జాతీయ కుష్ఠు వ్యాధి నిర్మూలన కార్యక్రమంలో భాగంగా సిబ్బందితో మాట్లాడుతూ ప్రస్తుతం పీహెచ్‌సీ పరిధిలో మూడు కుష్ఠు, నాలుగు టీబీ కేసులున్నాయన్నారు. జిల్లాలో గతంలో 122 కేసులుండేవని, ప్రస్తుతం 57 యాక్టివ్ కేసులున్నాయన్నారు. ఏప్రిల్, మే నెలల్లో మూడు కేసులు మాత్రమే నమోదయ్యాయన్నారు. వ్యాధి సోకిన వారికి ప్రభుత్వం ఉచితంగా మందులు, నెలకు రూ.500లు అందిస్తున్నట్లు తెలిపారు. 1-5 మచ్చలున్నవారు ఆరు నెలలు మందులు వాడాలని, 5 మచ్చలు పైగా ఉన్నవారు ఏడాది పాటూ ప్రభుత్వం ఉచితంగా అందించే మల్టీడ్రగ్ థెరపీ మందులు వినియోగించుకున్నట్లయితే పూర్తిగా వ్యాధి నయమౌతుందన్నారు. వ్యాధి లక్షణాలున్న వ్యక్తులు దగ్గర్లో ఉన్న పీహెచ్‌సీ, ఆశాలు, ఏఎన్ఎంలను సంప్రదించి ఉచిత పరీక్షలు చేయించుకుని, మందులు పొందవచ్చన్నారు. రాష్ట్రంలో కుష్ఠువ్యాధి కేసులు గణనీయంగా తగ్గాయన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి కవిత అనసూయ దేవి, డీపీఎం రమణారావు, సిబ్బంది అంజమ్మ, శ్రీనివాసరెడ్డి ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

స్విమ్మింగ్‌లో జగదీష్‌కు పతకాలు



నరసరావుపేట ఈస్ట్: ఆంధ్రప్రదేశ్ అమెచ్యూర్ ఆక్వాటిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన 11వ సీనియర్ రాష్ట్రస్థాయి ఆక్వాటిక్ ఛాంపియన్‌షిప్- 2025 స్విమ్మింగ్ పోటీల్లో శ్రీసుబ్బరాయ అండ్ నారాయణ కళాశాల విద్యార్థి ఎస్.జగదీష్ బంగారు పతకాలు సాధించినట్టు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.ఎస్.సుధీర్, వ్యాయామ అధ్యాపకుడు డాక్టర్ యక్కల మధుసూదనరావు మంగళవారం తెలిపారు. కళాశాల స్విమ్మింగ్ పూల్‌లో నిర్వహించిన పోటీల్లో జగదీష్ 200 మీటర్ల ఫ్రీస్టైల్, బటర్ ఫ్లై విభాగాల్లో బంగారు, 100 మీటర్లు ఫ్రీస్టైల్‌లో రజితం, బటర్ ఫ్లై విభాగంలో కాంస్య పతకాలు సాధించినట్టు వివరించారు. పతకాలు సాధించిన జగదీష్‌ను కళాశాల పాలకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు కపలవాయి విజయకుమార్, నాగసరపు సుబ్బరాయగుప్త, వైస్‌ప్రిన్సిపల్ డాక్టర్ పి.శ్రీనివాససాయి, కమిటీ సభ్యులు, అధ్యాపకులు అభినందించారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేసే ప్రాంతాలు

చిలకలూరిపేట: విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా బుధవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు పట్టణంలోని పలు ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ డీఈఈ ఆర్ అశోక్ కుమార్ తెలిపారు. పట్టణంలోని సీఆర్ కాలనీ, ఓల్డ్ బ్యారస్ నగర్, ఏఎంజీ డొంక, కుమ్మరి కాలనీ, వేలూరు రోడ్డు, గుర్రాల చావిడి, తూర్పు మాలపల్లె, కావమ్మ గుడి పరిసర ప్రాంతాలలో సంబంధిత వేళల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

ఏడు, ఎనిమిది తేదీల్లో చెస్ పోటీలు

నరసరావుపేట: శ్రీ కల్పవల్లి సేవా ట్రస్ట్ సహకారంతో చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నరసరావుపేట మండల స్థాయి చదరంగం పోటీలు ఈనెల ఏడు, ఎనిమిది తేదీల్లో మోర్ సెంటర్‌లోని వాగ్దేవి జూనియర్ కళాశాలలో నిర్వహిస్తున్నట్లు చెస్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ కె.కోటేశ్వరరావు మంగళవారం పేర్కొన్నారు. ఈ మేరకు ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ అధ్యక్షులు వనమా సాంబశివరావు ఆధ్వర్యంలో కరపత్రాలను ఆవిష్కరించారు. వివరాలకు ఫోన్ నెంబర్ 8897341989 సంప్రదించాలని కోరారు.

ఉపాధి హామీ పనుల పరిశీలన

రొంపిచర్ల: మండలంలో జరుగుతున్న ఎన్‌ఆర్‌ఈజీఎస్ పనులను ఏపీడీ హీరాలాల్ మంగళవారం పరిశీలించారు. ఇటీవల మండలంలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ పనుల్లో వచ్చిన అవకతవకులు పై అలాగే రేషన్ బియ్యంలో వచ్చిన సమాచారం పై కూడా ఆయన వాకబ్ చేశారు. క్షేత్రస్థాయిలో జాబ్ కార్డుతో పనికి వచ్చిన వారికే మచ్చర వేయాలని సూచించారు.

రైతుల రెండో జాబితా పంపించండి

నరసరావుపేట: లింగంగుంట్ల పుష్పగిరి పీఠం అగ్రహారం స్వాముల వారి భూముల చెందిన రైతుల రెండో జాబితాను వెంటనే ఎండోమెంట్ కమిషనర్‌కు పంపించాలని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు కోరారు. మంగళవారం గ్రామ మాజీ సర్పంచ్ పొన్నపాటి ఈశ్వరరెడ్డి, గ్రామ కమిటీ నాయకులతో కలిసి కలెక్టర్ కార్యాలయంలో జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరేను కలిశారు.

డ్రైవర్లు తోడ్పాటు అందించాలి

నరసరావుపేట: ఇంధనాన్ని పొదుపు చేస్తూ ప్రమాదాలు జరగకుండా ఆర్టీసీ డ్రైవర్లు సంస్థ ఆర్థికాభివృద్ధికి తోడ్పడాలని ఆర్టీసీ జిల్లా ప్రజా రవాణా అధికారి ఎం.మధు సూచించారు. జిల్లాలో జరుగుతున్న ప్రమాదాలు, తక్కువగా వస్తున్న మైలేజ్‌ను పురస్కరించుకొని మంగళవారం డ్రైవింగ్ స్కూలులో డ్రైవర్లకు అశోక్ లేలాండ్ కంపెనీ ప్రతినిధి మురళీకృష్ణచే బీ 6 వెహికల్స్‌పై అవగాహన కల్పించారు.

అనుమతి ఉన్న డీలర్ వద్దే విత్తనాలు కొనండి

జిల్లా వ్యవసాయ అధికారి ఐ.మురళీ



పార్శిల్ కార్యాలయంలో తనిఖీలు నిర్వహిస్తున్న మురళీ

నరసరావుపేట రూరల్: రైతులు విత్తనాలను లైసెన్స్ కలిగిన డీలర్ వద్దనే కొనుగోలు చేయాలని జిల్లా వ్యవసాయ అధికారి ఐ.మురళీ తెలిపారు. పట్టణంలోని పార్శిల్ రవాణా కార్యాలయాల్లో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో సోమవారం తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో వ్యవసాయ శాఖ జిల్లా అధికారి మురళీతో పాటు ఏడీఏ పి. మస్తానమ్మ, ఏవో వి.నరేంద్రబాబు పాల్గొన్నారు. ఎస్ఆర్ఎంటి, శ్రీహరి డైలీ పార్శిల్ సర్వీస్, నవత ట్రాన్స్‌పోర్ట్, బీఎంపీఎస్ కార్యాలయాల్లో తనిఖీలు నిర్వహించారు. ఎల్ఆర్ నెంబర్లు ఫిజికల్ స్టాక్‌ను చెక్ చేశారు. నకిలి విత్తనాలు పార్శిల్‌లో వస్తే వ్యవసాయ అధికారికి సమాచారం అందించాలని సూచించారు. ఈ సందర్భంగా మురళీ మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ ప్రారంభమవుతున్న దృష్ట్యా నకిలి పత్తి విత్తనాలు రవాణాను అరికట్టేందుకు తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు. రైతులు విత్తనాలు కొనుగోలు సమయంలో తగిన బిల్లును తీసుకొని భద్రపర్చుకోవాలని సూచించారు. ప్రతి డీలరు విత్తన నిల్వలను స్టాక్ బోర్డులో నమోదు చేసి స్టాక్ రిజిస్టర్లను నిర్వహించాలని తెలిపారు.

ప్రతిరోజు ధరల పట్టికను ప్రదర్శించాలని తెలిపారు. రైతులకు విత్తనాలు అమ్మిన వెంటనే తప్పనిసరిగా రశీదు ఇవ్వాలని స్పష్టంచేశారు. ఎంఆర్‌పీ కంటే అధిక ధరకు విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామాల్లో అనధికారకంగా విత్తన నిల్వలు చేసి రైతులకు అమ్మిన వారిపై కఠిన చర్యలు ఉంటాయని తెలిపారు. అనధికారికంగా గ్రామాల్లో విత్తనాలు విక్రయించే వారి సమాచారాన్ని తెలియజేయాలని కోరారు.

అధిక ధరలకు విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు



తనిఖీలు నిర్వహిస్తున్న ఎంఏవో టి.శ్రీలత

చిలకలూరిపేట: విత్తనాలు అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని మండల వ్యవసాయాధికారి టి.శ్రీలత హెచ్చరించారు. పట్టణంలోని విత్తన దుకాణాలతో పాటు, ట్రాన్స్‌పోర్టు కార్యాలయాలలో మంగళవారం తనిఖీలు నిర్వహించారు. విత్తనాలకు సంబంధించి వివరాలు ఎక్కడి నుంచి సరఫరా అవుతున్నాయి వంటి అంశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తగు రసీదులు లేకుండా రైతులు విత్తనాలు కొనుగోలు చేయరాదని సూచించారు. లైసెన్స్ ఉన్న దుకాణాల్లో మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలని వెల్లడించారు. ఎవరైనా అధిక ధరలకు విత్తనాలు విక్రయించినా, రసీదులు ఇచ్చేందుకు నిరాకరించినా 8331056944 నంబర్‌కు ఫోన్ చేయాలని కోరారు.

విత్తన షాపుల్లో తనిఖీలు

వినుకొండ: పట్టణంలోని పలు విత్తనషాపులను, ట్రాన్స్‌పోర్ట్ ఆఫీసులను వినుకొండ వ్యవసాయాధికారి జి.వరలక్ష్మి మంగళవారం ఆకస్మికంగా పరిశీలించారు. ఈసందర్భంగా షాపుల్లోని స్టాకును, ఇన్వాయిస్‌లు, తోపాటు ప్యాక్‌లను పరిశీలించారు.అనధికారికంగా విత్తనాలు పార్సిల్ సర్వీసులల్లో వస్తే తమకు సమాచారం ఇవ్వాలని, తెలిపారు. రైతులకు అమ్మే విత్తనాల బిల్లులపై లాట్‌నెంబరు,డేటు, వివరాలు తప్పనిసరిగా నమోదు ఏయాలని సూచించారు. నకిలీ విత్తలనాలు అమ్మేవారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. రైతులకు కూడా నాణ్యమైన,ప్రభుత్వగుర్తింపు నిచ్చిన విత్తనాలను కొనాలని సూచించారు.

భోజన నిర్వాహకులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి



వంటల పోటీలో గెలుపొందిన వారితో ఎంఇవో రవిచంద్ర

నూజెండ్ల: మధ్యాహ్న భోజన నిర్వాహకులు పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని మండల విద్యాశాఖాధికారి రవిచంద్ర అన్నారు. మండల పరిధిలో గల ప్రభుత్వ పాఠశాలనందు పనిచేయుచున్న డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన నిర్వాహకులకు మంగళవారం నూజెండ్ల జెడ్పీ పాఠశాలలో ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ఎంఇవో రవిచంద్ర మాట్లాడుతూ పాఠశాల విద్యార్థులకు పోషక విలువలతో కూడిన భోజనం అందించాలన్నారు. అలాగే ఇకపై ప్రభుత్వం సన్నబియ్యం అందుబాటులోకి తెస్తుందన్నారు. అనంతరం హాజరైన వారికి వంటల పోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారికి బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఎస్సార్‌పి పద్మావతి, సిబ్బంది ఉన్నారు.

మలేరియా నివారణా మాసోత్సవ ర్యాలీ




ర్యాలీ నిర్వహిస్తున్న పీహెచ్‌సీ వైద్యులు, సిబ్బంది

రొంపిచర్ల: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మలేరియా నివారణ మాసోత్సవాల్లో భాగంగా మంగళవారం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి చెరువుకట్ట సెంటర్ వరకు సాగింది. చెరువుకట్ట సెంటర్‌లో మానవహారం ఏర్పాటు చేశారు. గ్రామస్తులకు మలేరియా వ్యాధి పై అవగాహన కల్పించారు. వైద్యాధికారి డాక్టర్ జగన్ నరసింహారెడ్డి మాట్లాడుతూ మలేరియా ప్రాణాంతక వ్యాధి అని అన్నారు. పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రత పాటించి, మురుగు కాల్వల్లో నీరు నిల్వ ఉండకుండా పారే విధంగా చేస్తే ఈ వ్యాధిని నివారించవచ్చునని అన్నారు. ఇళ్ల ముందు ఉన్న మురికి కాల్వల్లో నీరు నిల్వ ఉంటే దోమలు పెరిగి మలేరియా, డెంగ్యూ వంటి వ్యాధులు ప్రబలే అవకాశముందని అన్నారు. వాతావరణంలో మార్పులు వలన జలుబు, దగ్గు, జ్వరం వంటి సాధారణ వ్యాధులు, సీజనల్ వ్యాధులు వచ్చే అవకాశం ఉందని అన్నారు. ఆయా వ్యాధులు వచ్చిన వారు వెంటనే వైద్యులను సంప్రదించి నివారణ పొందాలన్నారు. మలేరియా అంతం మన చేతుల్లోనే ఉందన్నారు. దోమల నివారణకు అందరూ కలిసికట్టుగా పని చేయాలని గ్రామస్తులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సి.హెచ్.ఓ చంద్రశేఖర్, హెల్త్ సూపర్ వైజర్ రామయ్య, హెల్త్ అసిస్టెంట్లు కిరణ్ కుమార్, సురేష్, ఎఎన్ ఎంలు, ఆశా కార్యకర్తలు, వైద్య సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో కిశోరీ వికాస శిక్షణ



విప్పర్లలో ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు




మాచవరంలో ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు



రొంపిచర్లలో నిర్వహించిన ర్యాలీ

రొంపిచర్ల: మండలంలో సంతగుడిపాడు, రొంపిచర్ల, ఆరేపల్లి, విప్పర్ల, మాచవరం గ్రామాలలో కిశోరి వికాసం వేసవి శిక్షణ కార్యక్రమాల్లో భాగంగా మంగళవారం కౌమారి బాలికల నాయకత్వం, సాధికారితపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఆయా అంగన్‌వాడీ కేంద్రాలలో కిశోరి బాలికలకు, కౌమార బాలికలకు నాయకత్వ లక్షణాలు గురించి, సమర్థత గురించి వివరించారు. అదే విధంగా లింగవివక్షత, సమానత్వంపై అవగాహన కలిగిస్తూ గ్రామాలలో ర్యాలీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు కె.శశిదేవి, ఎస్.కె. షమీమ్ సుల్తానా, జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్ సభ్యురాలు శైలజా, ఆయా గ్రామాల మహిళా పోలీసులు, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, కిశోరి బాలికలు పాల్గొన్నారు.


రైతులను మోసం చేస్తున్న కూటమి



అన్నదాత సుఖీభవ పథకం కింద రైతులు, కౌలు రైతులకు పంట పెట్టుబడి సహాయం రూ.20వేలు ఇస్తామన్న కూటమి ప్రభుత్వం ఇప్పటివరకు అందజేయలేదు. పెట్టుబడి సహాయం లభించక పంట సాగు చేయడం కష్టంగా మారింది. ముఖ్యంగా రైతు కూలీలు, కౌలు రైతుల పరిస్థితి మరీ ఘోరంగా ఉంది. అధికారంలోకి వచ్చి ఏడాదైనా ఇంకా వాటి ఊసేత్తడం లేదు, కనీసం అన్నదాత సుఖీభవ పథకంకు సంబంధించిన విధివిధానాలు వెల్లడించక పోవడం రైతులకు చేస్తున్న మోసం కాదా?

-వై.రాధాకృష్ణ, ఆంధ్రప్రదేశ్ కౌలురైతు సంఘం అధ్యక్షుడు

కక్ష సాధింపులకే పరిమితం



కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో ప్రజలకు ఒరిగిందేమి లేదు. ఎన్నికల హామీలను అమలు చేయకుండా ప్రతిపక్ష వైఎస్సార్ సీపీ నేతలు, కార్యకర్తలపై అక్రమ కేసులతో కక్షసాధింపు చర్యలకు దిగుతున్నారు. కూటమి ప్రభుత్వం వెంటనే ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి.ముఖ్యంగా బడుగు బలహీన వర్గాల ప్రజల కొనుగోలు శక్తి తగ్గి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వారికి అందజేస్తామన్న పథకాలు వెంటనే అమలు చేయాలి.

– పాలపర్తి వెంకటేశ్వరరావు, రాష్ట్ర గిరిజన కార్పొరేషన్ మాజీ డైరెక్టర్, నరసరావుపేట